

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 36.0 । కనిష్ఠం : 27.0

సొంత జిల్లాలో.. పంతం నెగ్గేనా

» పాలమూరు పోరును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి
» వంశీచంద్‌రెడ్డి గెలుపు కోసం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పది సార్లు పర్యటన



నారాయణపేట జిల్లా మక్తల్‌లో నిర్వహించిన జన జాతర సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి (ఫైల్)

మహబూబ్‌నగర్, మే 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పార్లమెంట్ ఎన్నికలు రాష్ట్రంలో హోరాహోరీగా సాగాయి. పోలింగ్ ముగిసి ఫలితాలు వెలువడటమే మిగిలింది. ఏ ఎన్నికల్లో లేనివిధంగా ఈసారి పాలమూరు పార్లమెంట్ స్థానాల్లో పోరును అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో అన్ని పార్టీలు ఇక్కడ ఎక్కువ శ్రద్ధ చూపాయి. నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 14 స్థానాలకు గాను 12 స్థానాలను కాంగ్రెస్ పార్టీ దక్కించుకున్నది. అదే ఊపును ఈ పార్లమెంట్ ఎన్నికల్లో చూపి సొంత జిల్లాలో తన పంతం నెగ్గించుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి భావించారు. అందుకే మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా పది సార్లు పర్యటించారు. "పాలమూరు బిడ్డ ముఖ్యమంత్రి అయితే జీర్ణించుకోలేకపోతున్నారు, ఇక్కడి బిడ్డకు సీఎం అయ్యే అర్హత లేదా? ఇక్కడి ప్రజల బాధలు నాకే ఎక్కువ తెలుసు" అనే అంశాలను బలంగా తీసుకుపోయేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వాన్ని పడగొడదామని చూస్తున్నారని, పాలమూరు బిడ్డను తాకితే కరెంటు షాక్ తగులుతుందనే విషయాన్ని నిరూపించాలని, బీజేపీ, బీఆర్‌ఎస్ ఒక్కటయ్యాయనే విషయాలను కూడా పదేపదే ప్రస్తావించారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలని పెద్దలు అంటారని, అందుకే పాలమూరులో రెండు స్థానాలను గెలిపించి, తనకు బలం ఇవ్వాలని సీఎం అన్ని సందర్భాల్లో ప్రజలను కోరారు. అలాగే అధికారంలోకి వచ్చిన తర్వాత వెంటనే కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ. 5 వేల కోట్లు కేటాయించారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న జీఓ 69 పథకాన్ని రీడిజైన్ చేసి 1.30 లక్షల ఎకరాకు నీరందించే మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి కూడా ఎన్నికలకు ముందే శంకుస్థాపన చేసి పనుల ప్రక్రియను ప్రారంభించారు. మక్తల్ నియోజకవర్గంలో 20 వేల ఎకరాలకు సాగునీరు అందించే సంగంబండ రిజర్వాయర్ వద్ద బండను పగులగొట్టే ప్రక్రియ ఏళ్లుగా పెండింగ్‌లో ఉంటే రూ. 10 కోట్లు మంజూరు చేశారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని ఏడుకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కైవసం చేసుకున్నప్పటికీ ఏ ఒక్క అంశాన్ని వదలకుండా ఎప్పటికప్పుడు ఎమ్మెల్యేలకు, అభ్యర్థికి సూచనలు చేశారు. దాదాపు అన్ని నియోజకవర్గాలను తన పర్యటనలో కవర్ చేసిన ముఖ్యమంత్రి.. తనకు ఇక్కడ గెలుపు ఎంత ముఖ్యమో ప్రజలకు వివరించారు. కొడంగల్ నియోజకవర్గంలోనే నాలుగుసార్లు ఆయన పర్యటించగా దేవరకద్రలో కొంత ఇబ్బంది ఉన్నదన్న సూచనల మేరకు కొత్తకోట పట్టణంలో కార్నర్ మీటింగ్, మక్తల్, నారాయణపేటలలో జనజాతర సభ, మహబూబ్‌నగర్‌లో ఒక కార్నర్ మీటింగ్, జన జాతర సభ, షాద్‌నగర్‌లో కార్నర్ మీటింగ్‌కు రేవంత్ హాజరయ్యారు.

చేరికలకు ప్రోత్సాహం...

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలమూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో చేరికలను ఎక్కువగా ప్రోత్సహించింది. బీజేపీని దెబ్బకొట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆ పార్టీ సీనియర్ లీడర్ అయిన ఏపీ జితేందర్‌రెడ్డిని ఆయన ఇంటికి వెళ్లి మరీ ఆహ్వానించి పార్టీలో చేర్చుకున్నారు. ఆ తర్వాత మక్తల్ నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీచేసి, జితేందర్ రెడ్డి అనుచరుడిగా పేరున్న ఎం. జలంధర్‌రెడ్డిని కూడా పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే కోస్గి, నారాయణపేట, మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలను కాంగ్రెస్ హస్తగతం చేసుకున్నది. వీరేకాకుండా పలువురు బీఆర్‌ఎస్ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులను కూడా పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల్లో ఏ చిన్నలీడర్‌ను కూడా వదలకుండా పార్టీ కండువా కప్పుకున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జడ్పీ ఛైర్‌పర్సన్‌లను కూడా పార్టీలో చేర్చుకున్నారు. అలాగే ఇటీవల ప్రకటించిన కార్పొరేషన్ ఛైర్మన్లను నియోజకవర్గానికి ఒకరిని ఇన్‌చార్జిగా నియమించుకొని పార్టీ అంతర్గత వ్యవహారాలతో పాటు కో ఆర్డినేషన్ కోసం నియమించారు. నిత్యం వారి నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటూ ఇంటలిజెన్స్, పార్టీ సర్వేలను అంచనాలను వేసుకొని సీఎం రేవంత్‌రెడ్డి సూచనలు చేశారు. మరోవైపు ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కూడా ఇది తన ఎన్నిక మాత్రమే కాదని, పాలమూరు ప్రజలను గెలిపించుకునే ఎన్నిక అని, రేవంత్‌రెడ్డికి కొండంత అండగా నిలిచే ఎన్నిక అని ప్రచారం చేశారు. బీజేపీ బలంగా ఉన్నదన్న నియోజకవర్గాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడిన బీఆర్‌ఎస్ పార్టీపై ఎక్కువగా ఒత్తిడి తీసుకురావడం ద్వారా ఓట్ల చీలిక జరుగుతుందనే ఉద్దేశంతో పార్టీ ప్రచార సరళిని కొనసాగించారు. ప్రచారం ముగిసిన తర్వాత ఓట్ల పోలరైజేషన్ కోసం పార్టీ కేడర్‌ను పూర్తిగా గ్రామాలు, గల్లీల్లోకి దింపారు. 20 ఓట్లకు ఒక కార్యకర్త చొప్పున నియమించి పోలరైజేషన్‌ను పెంచారు.

నాగర్‌కర్నూల్‌లో రెండుసార్లు ప్రచారం

మహబూబ్‌నగర్‌తో పోల్చితే నాగర్‌కర్నూలులో సీఎం రేవంత్‌రెడ్డి రెండుసార్లు మాత్రమే పర్యటించారు. ఒకసారి రాహుల్‌గాంధీ సభలో పాల్గొనగా అంతకుముందు బిజినేపల్లిలో నిర్వహించిన జనజాతర సభలో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌తో పోల్చితే నాగర్‌కర్నూలులో గెలుపు సులభమేననే అంచనాల మేరకు మహబూబ్‌నగర్ పార్లమెంట్‌పై ఎక్కువగా దృష్టి సారించారని చెప్పవచ్చు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అంచనాల ప్రకారం ఈ రెండు స్థానాల్లో గెలుస్తామని ధీమాతో నాయకులు ఉన్నారు. సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ పార్టీని ఓడించడం ద్వారా ఆయనను కొంత వీక్ చేయవచ్చని బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఎత్తుగడలు వేశాయి. సీఎం విమర్శలతో పాటు పాలమూరు ఆడబిడ్డను ఓడించేందుకు కుట్రలు చేస్తున్నారని, అవమానిస్తున్నారని డీకే అరుణ కూడా సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగించారు. సొంత జిల్లాలో రెండు స్థానాలను గెలుచుకొని సీఎం తన పంతం నెగ్గించుకుంటారా, లేక బీజేపీ, బీఆర్‌ఎస్‌లు సీఎం సొంత జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించే ప్రయత్నాలు ఫలిస్తాయా అనేది వేచి చూడాలి.

మైనింగ్‌పై పోరు

» మైలారం గుట్టపై తవ్వకాలకు 2017లో అనుమతులు
» ఫోర్జరీ సంతకాలతో పర్మిషన్ పొందారంటున్న గ్రామస్థులు
» గుట్టపై పురాతన దేవాలయాలు, నివాస గృహాలు
» తవ్వకాలు చేపడితే తమ మనుగడకు ముప్పంటున్న ప్రజలు
» పార్లమెంట్ ఎన్నికల బహిష్కరణ

మైనింగ్ తవ్వకాల కోసం అనుమతి పొందిన మైలారం గుట్టపైకి ఏర్పాటు చేసిన రోడ్డు





గుట్టపై ఉన్న శివాలయం

అచ్చంపేట, మే 15: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం మైలారం గ్రామంలో మైనింగ్ తవ్వకాలు చేపడితే ఊరుకోబోమని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలను గ్రామస్థులు బహిష్కరించి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. గ్రామంలో మొత్తం 786 ఓట్లు ఉండగా అధికారులు అతికష్టం మీద ఆరుగురితో ఓటు వేయించారు. సర్వే నంబర్ 120/1లోని ప్రభుత్వ భూమిలో క్వార్ట్జ్, ఫెల్డ్‌స్పార్ ఖనిజ తవ్వకాలకు 2017లో అప్పటి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. కాంట్రాక్టరు తప్పుడు నివేదికలతో అనుమతులు పొందారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మైనింగ్ లభించే గుట్టకు గ్రామం ఆనుకొని ఉంది. గుట్టపై దాదాపు 30 నివాస గృహాలు, పురాతన ఆలయాలు ఉన్నాయి. దాంతో మైనింగ్ చేపడితే గ్రామ ఉనికికే ప్రమాదం పొంచిఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు పొందిన కాంట్రాక్టరు సర్వే చేసేందుకు గత ఏడాది ఉపక్రమించడంతో మైనింగ్ విషయం తెరపైకొచ్చింది. అందులో భాగంగానే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి గ్రామంలో ప్రచారం చేయొద్దని, తాము ఓట్లు వేయబోమని గ్రామస్థులు తీర్మానించి ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్డీవో మాధవి ఎన్నికల కంటే



గుట్టపై ఏర్పాటు చేసుకున్న ఇల్లు

ముందు రోజు, ఎన్నికల రోజు పోలీసులతో కలిసి గ్రామానికి చేరుకున్నారు. ఓటింగ్‌లో పాల్గొనాలని ఎంత నచ్చజెప్పినా వారు ససేమిరా అన్నారు. మైనింగ్ అనుమతులు రద్దు చేసే వరకు తమ పోరాటం ఆగదని చెప్పారు. అవసరమైతే కోర్టుకు వెళ్తామని అంటున్నారు.

గ్రామ మనుగడకే ముప్పు

200 కుటుంబాలు ఉన్న మైలారం గ్రామంలో దాదాపు 1,000కి పైగా జనాభా నివసిస్తోంది. గ్రామ సమీపంలో పెద్ద చెరువుతో పాటు 90 ఎకరాల విస్తీర్ణంలో గుట్ట ఉంది. చెరువు ద్వారా మైలారానికి తాగు, సాగునీరు అందుతోంది. దాంతో పాటు అనంతవరం, నర్సాయిపల్లి, అంబగిరి ఉమ్మడి గ్రామ పంచాయతీతో పాటు కొండనాగుల, బల్మూరు, రామాజిపల్లి, గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి.. బోర్లలో నీళ్ల వస్తున్నాయి. పశువులు, మేకలకు పశుగ్రాసం లభించే గుట్ట ధ్వంసం అయితే జీవవైవిధ్యం దెబ్బ తిని తమ మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని గ్రామస్థులు అంటున్నారు. మైనింగ్ తవ్వకాలను ఎట్టి పరిస్థితిల్లో చేపట్టొద్దని అంటున్నారు.

మైనింగ్ ఆపాల్సిందే



ఊరికి భరోసాగా గుట్ట ఉంది. గుట్టపైన పురాతన దేవాలయాలు ఉన్నాయి. ఊరికి ఇబ్బంది కల్గించే మైనింగ్ పనులు ఆపాల్సిందే. అందు కోసం మేము ఎవరం ఓట్లు వేయలేదు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని మాకు న్యాయం చేయాలి.

\- పెద్ద లింగయ్యగౌడ్, మైలారం

ఆపేదాక పోరాడతాం



మా ఊరి గుట్టపై మైనింగ్ పనులు చేపడితే పశువులకు మేత దొరకదు. బాంబులు పెట్టి పేల్చితే మా ఊరికి పెద్ద దెబ్బ తగులుతుంది. ఇండ్లు నెర్రెలు వారుతాయి. పొమ్మనలేక పొగ పెట్టినట్లు అయితది. పనులు ఆగేదాక ఊరు మొత్తం కలిసి అడ్డుకుంటాం.

\- గూడెళ్లి నిరంజన్, మైలారం

ఊరే మిగలదు



ప్రశాంతంగా ఉన్న గ్రామానికి మైనింగ్ భయం పట్టుకుంది. పనులు చేపడితే గ్రామంలోని ఇళ్లకు పగుళ్ల వచ్చే ప్రమాదం ఉంది. చెరువులో నీళ్ల కలుషితం అవుతాయి. రాజకీయాలకు అతీతంగా అందరం ఒక్కటై మైనింగ్‌ను అడ్డుకుంటాం.

\- బంగారయ్య, మైలారం

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి



రిషి(ఫైల్)

అమ్రాబాద్, మే 15: ఈతకు వెళ్లి విద్యార్థి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్ల బావి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాలు ప్రకారం.. పదర మండల కేంద్రానికి చెందిన మద్దెల రవి కుమార్, రజితల ఏకైక కుమారుడు రిషి కుమార్(14) వేసవి సెలువుల నేపథ్యంలో అమ్మమ్మ ఊరు వెంకటేశ్వర్ల బావికి రెండు రోజుల కిందట వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం మరికొందరు బాలురతో కలిసి ఈత కొట్టేందుకు గ్రామ సమీపంలో ఓ రైతు పొలంలో తీసిన నీటి గుంత వద్దకు వెళ్లారు. ఈత సరిగా రాని రిషి నీటిలో మునిగి పోయిన విషయాన్ని మిగతా వారు గమనించలేదు. కొంత సమయం తర్వాత రిషి కనిపించక పోవడంతో వెళ్లి గ్రామస్థులకు చెప్పారు. గ్రామస్థులు వచ్చి చూడగా, అప్పటికే రిషి మృతి చెదాడు. బాలుడు అచ్చంపేట సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయంలో వచ్చే విద్యా సంవత్సరం తొమ్మిదో తరగతి చదవాల్సి ఉంది. రిషి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. బాలుడి మృతిపై తమకు ఫిర్యాదు అందలేదని అమ్రాబాద్ ఎస్ఐ రమేష్ తెలిపారు.

ఆలయాల భూములపై నివేదిక ఇవ్వండి

» మానవపాడు తహసీల్దారును ఆదేశించిన కలెక్టర్
» ఎండోమెంట్ కమిషనర్ సైతం ఆరా
» అనుభవదారుల్లో గుబులు

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం



మానవపాడు తహసీల్దార్ కార్యాలయం

అలంపూర్ చౌరస్తా/మానవపాడు, మే 15: జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం చెన్నిపాడు చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి ఆలయ భూములపై నివేదిక ఇవ్వాలని కలెక్టర్ బీఎం సంతోష్ మానవపాడు తహసీల్దారును ఆదేశించారు. 'అమ్మకానికి ఆలయాల భూములు' అన్న శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో సదరు దేవాలయాల భూములపై వచ్చిన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఎండోమెంట్ కమిషనర్ కూడా ఆరా తీసినట్లు తెలిసింది. భూముల ధరలకు రెక్కలు రావడంతో ఆ భూముల అనుభవదారు తన నలుగురు కుమారులపై పట్టా చేసి, అమ్మకానికి సిద్ధం చేశారని వార్త ప్రచురితమైంది. దాంతో బుధవారమే సంబంధిత సర్వే నంబర్ 155పై పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. పట్టా మార్పిడి ఏ సంవత్సరంలో జరిగింది?, మార్పిడి వెనుక ఎవరి హస్తం ఉందన్న పూర్తి వివరాలు కోరినట్లు తెలిసింది. దీంతో మానవపాడు రెవెన్యూ కార్యాలయ అధికారులు సదరు ఆలయాల భూముల రికార్డులను పరిశీలించారు. గ్రామ పెద్దలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆలయాల భూములను కాపాడాలని, దేవాలయాల్లో సేవ చేసేందుకు ఎండోమెంట్ శాఖకు తమ పూర్వీకులు భూములు ఇచ్చారని గ్రామ పెద్దలు తెలిపారు. భూమిని అనుభవించే వారు టెంపుల్స్‌లో రోజూ మంగళవాయిద్యాలు వినిపించాలనే నిబంధన ఉన్నట్లు గ్రామ పెద్దలు సీతారామిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, తిరుమల్‌రెడ్డి, పుల్లారెడ్డి, జ్ఞానేశ్వరరెడ్డి, రాజారెడ్డి, సంపత్‌రెడ్డి తదితరులు రెవెన్యూ అధికారులకు తెలిపారు. భూములపై పూర్తి నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు అందించనున్నట్లు మండల అధికారులు చెప్పారు.

ఎండోమెంట్ శాఖ ఆరా: చెన్నిపాడు ఆలయాల భూముల బాగోతంపై దేవాదాయశాఖ ఆరా తీసినట్లు జిల్లా శాఖ అధికారులు తెలిపారు. భూములను పరిశీలించి నివేదిక కోరారని శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వరి తెలిపారు. అనుభవదారులపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని చెప్పారన్నారు. రెవెన్యూ అధికారులకు తమ వద్ద ఉన్న ఆధారాలు ఇస్తామని, పట్టామార్పిడికి కారణాలను విశ్లేషించాల్సి ఉందని అన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలతో.. అభివృద్ధి

» పాఠశాలలు తెరిచే నాటికి మౌలిక వసతుల కల్పన
» 25 శాతం నిధులు విడుదల చేసిన ప్రభుత్వం
» తాగునీరు, మరుగుదొడ్లపై ప్రత్యేక దృష్టి



శ్రీరంగాపురం మండలం కంబాలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

వనపర్తి రూరల్, మే 15: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు శ్రీకారం చుట్టింది. స్కూల్స్ తెరిచే నాటికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తోంది. జిల్లాలో డీఈవో పరిధిలో 537 పాఠశాలలు ఉండగా, కేజీబీవీలు 15, మోడల్ స్కూల్ మూడు, యూపీఎస్ స్కూల్ ఒకటి, ఎండోమెంట్ స్కూల్స్ 28 ఉన్నాయి. టీచర్లు అలాట్‌మెంట్ లేని స్కూల్స్ మరో రెండు ఉన్నాయి. వాటిలో 317 పాఠశాలలకు మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు పంపించారు. 305 పాఠశాలలకు నిధులు విడుదల చేశారు. కార్పొరేట్ తరహాలో పాఠశాలలను తీర్చిదిద్దే దిశగా ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే పలు పాఠశాలలో సౌకర్యాలను కల్పించగా, మిగతా వాటిలో జూన్ నాటికి కల్పించుచున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పర్యవేక్షణలో తాగునీటి సౌకర్యం కల్పన మరుగుదొడ్ల మరమ్మతులు, విద్యుదీకరణ పనులు చేపడుతున్నారు. పాఠశాలలకు రంగులు వేయడం, గ్రీన్ చాక్ బోర్డులు, సోలార్ ఫ్యాన్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామ సమాఖ్య మహిళా సంఘాల ద్వారా, పట్టణ ప్రాంతాల్లో ఏఎల్ఎఫ్(ఏరియా లెవెల్ ఫెడరేషన్) ద్వారా పనులు ప్రారంభమయ్యాయి. నిధులు మంజూరైన 305 స్కూల్స్‌లో పనులు చేపట్టేందుకు విద్యాశాఖ ప్రణాళిక తయారు చేసింది. ఇప్పటికే గ్రామ సంఘం అధ్యక్షురాలు, సంబంధిత పాఠశాల హెచ్ఎంల పేరిట బ్యాంకు ఖాతాలు తెరిచారు.

40 పాఠశాలల్లో పనులు పూర్తి

535 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 183 పాఠశాలలను గత ప్రభుత్వం మన ఊరు మన బడి కింద ఎంపిక చేసింది. అందులో 40 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగతా పాఠశాలల్లో వివిధ కారణాలతో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో చేపట్టాల్సిన పనులను గుర్తించారు. వాటి కోసం రూ.11,48,45,000 నిధులు అవసరం అవుతాయని ప్రభుత్వం అంచనా వేయగా.. మొదటి విడతగా 25 శాతం నిధులు అంటే రూ.2,87,11,000 విడుదల చేసింది.

అన్ని వసతులు కల్పిస్తాం

అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా జిల్లాలోని పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నాం. తాగునీరు, మరుగుదొడ్డు సౌకర్యాలతో పాటు చిన్న చిన్న పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 25 శాతం నిధులు విడుదలయ్యాయి. అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం.

\- గోవిందరాజులు, డీఈవో

పది సప్లిమెంటరీపై.. ప్రత్యేక దృష్టి

» 2,127 మంది విద్యార్థులు ఫెయిల్
» అందరూ పాస్ అయ్యేలా విద్యా శాఖ చర్యలు » వచ్చే నెల 3 నుంచి ఎగ్జామ్స్



మహబూబ్‌నగర్‌లోని మాడ్రన్ హైస్కూల్ కేంద్రం వద్ద వార్షిక పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు(ఫైల్)

మహబూబ్‌నగర్, విద్యావిభాగం మే 15: పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులను సప్లిమెంటరీ పరీక్షలకు విద్యా శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యలకు సంబంధించి 12,673 మంది వార్షిక విద్యార్థులు పరీక్ష రాయగా.. 89.47 శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. 2,127 మంది విద్యార్థులు వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యారు. సప్లిమెంటరీ పరీక్షలను జూన్ మూడో తేదీ నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నారు. పరీక్షలకు 16 రోజులు మాత్రమే గడువు ఉండటంతో విద్యాశాఖ అధికారులు విద్యార్థులు పాస్ అయ్యేలా దృష్టి పెట్టారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఫెయిల్ అయిన సబ్జెక్టులకు సంబంధించి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

గణితంలో అధికంగా ఫెయిల్

పరీక్షల్లో గణితంలో 594 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. సైన్స్‌లో 573, ఇంగ్లీష్‌లో 349, తెలుగులో 385, సోషల్‌లో 170, హిందిలో 56 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. వీరంతా అడ్వాన్స్‌డ్ సంప్లిమెంటరీ పరీక్షలో పాస్ అయితే విద్యా ఏడాది నష్టపోకుండా ఇంటర్ లేదంటే ఇతర కోర్సుల్లో చేరే అవకాశం ఉంది. దీంతో పరీక్ష తప్పిన విద్యార్థులు పాస్ అయ్యేలా విద్యా శాఖ తరగతులను నిర్వహించడంతో పాటు సిద్ధం చేస్తోంది.

అందరూ పాస్ అయ్యేలా దృష్టి పెట్టాం

పదో తరగతి వార్షిక పరీక్షల్లో తప్పిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాం. జూన్‌లో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో అందరూ పాస్ అయేలా సిద్ధం చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, కేజీబీవీ ఎస్‌వోలకు చెప్పాం. సబ్జెక్టు ఉపాధ్యాయులు విద్యార్థులపై శ్రద్ధ చూపాలని ఆదేశించాం. ఈ 15 రోజుల పాటు విద్యార్థులపై దృష్టి ఉంచాలని చెప్పాం.

\- ఎ.రవీందర్, డీఈవో, మహబూబ్‌నగర్

పెద్దమందడిలో భూగర్భ జల బోర్డు సభ్యుల పర్యటన

- నేషనల్ వాటర్ అవార్డు కోసం దరఖాస్తు చేసుకున్న పంచాయతీ
- గ్రౌండ్ వాటర్ పెంచడానికి చేసిన పనులను పరిశీలించిన సభ్యులు

పెద్దమందడి, మే 15 : వనపర్తి జిల్లా పెద్దమందడి మండల పరిధిలో భూగర్భ జల బోర్డు సభ్యులు పర్యటించారు. పెద్దమందడి గ్రామ పంచాయతీ నేషనల్ వాటర్ అవార్డు కోసం దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తులో ఉన్న అంశాలను తెలుసుకోవడానికి గాను జాతీయ భూగర్భ జలమండలి బోర్డు సభ్యులు పర్యటించారని ఉపాధి హామీ మండల అధికారులు తెలిపారు. పెద్దమందడి గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా గ్రౌండ్ వాటర్ పెంచడానికి చేసిన వివిధ రకాల పనులను సభ్యులు పరిశీలించారు. దరఖాస్తులో పొందుపరిచిన విధంగానే పనులు ఉన్నాయని వారు తెలిపారు. సభ్యుల వెంట ఉపాధి హామీ మండల అధికారులు ఉన్నారు.


ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులను పరిశీలిస్తున్న భూగర్భ జల బోర్డు సభ్యులు

జూరాలకు చేరిన 1600 క్యూసెక్కుల నీరు

- తీరనున్న తాగునీటి కష్టాలు
- సీఎం, ఎమ్మెల్యే చొరవతో కర్ణాటక ప్రభుత్వం ద్వారా నీటి విడుదల


జూరాల ప్రాజెక్టులోని నీరు

అమరచింత, మే 15 : కర్ణాటక ప్రభుత్వం నారాయణపూర్ డ్యాం నుంచి మూడురోజుల క్రితం దిగువకు నీరు వదలడంతో బుధవారం సాయంత్రం నాటికి జూరాల ప్రాజెక్టుకు 1600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు ప్రాజెక్టుకు చేరింది. తాగునీటి కష్టాలు తీవ్రతరం కావడంతో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మూడు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి కర్ణాటక ప్రభుత్వాన్ని ఒప్పించి తాగునీటి అవసరాల కోసం నారాయణపూర్ డ్యాం నుంచి 1.9 టీఎంసీల నీరు వదలాలని కోరారు. ఇందుకు కర్ణాటక ప్రభుత్వం అంగీకరించి నీటిని విడుదల చేసింది. దీంతో మూడురోజుల నుంచి పూర్తిగా ఎండిన కృష్ణానది ప్రాంతాల్లో ఒట్టిపోయిన గుంతలను నీటితో పొడుస్తూ ముందుకు సాగి బుధవారం జూరాల ప్రాజెక్టుకు నీరు చేరింది. ప్రాజెక్టులో ప్రస్తుతం 2.70 టీఎంసీల నీటి నిల్వ ఉండగా 313.90 మీటర్ల మేర నీరు పెరిగింది. మరో 24 గంటల పాటు కర్ణాటక ప్రభుత్వం వదిలిన నీరు ప్రాజెక్టుకు వచ్చే అవకాశం ఉంది. ఏదేమైనా సీఎం, ఎమ్మెల్యే చొరవతో మక్తల్, వనపర్తి జిల్లాలో ఏర్పడిన తాగునీటి ఇబ్బందులు తీరే అవకాశాలు ఉన్నాయి. మరో రెండురోజులు ప్రాజెక్టుకు నారాయణపూర్ డ్యామ్ నుంచి చేరిన 1.9 టీఎంసీల పూర్తిస్థాయి నీరు జూరాల ప్రాజెక్టుకు చేరిన తరువాత ప్రాజెక్టు ఎడమ కాలువ లేక అనుసంధానం కెనాల్ ద్వారా తాగునీటి అవసరాల కోసం అధికారులు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. ఈ విషయమై ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బీచుపల్లిని వివరణ కోరగా నారాయణపూర్ డ్యామ్ నుంచి విడుదలైన నీరు జూరాల ప్రాజెక్టుకు చేరినట్లు తెలిపారు.

ఉమామహేశ్వర క్షేత్రంలో టీపీసీసీ సభ్యుడు

అచ్చంపేటటౌన్, మే 15: ఉమామహేశ్వర క్షేత్రంలో బుధవారం టీపీసీసీ ఎన్ఆర్ఐసెల్ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు బొజ్జ అమరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఈశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్, అర్చకుడు వీరయ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానా లు ఆచరించి ఈశ్వరుడికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి అయ్యప్ప స్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అర్చకులు వీరయ్య, నీలకంఠం, రాజశేఖర్, రవికుమార్ ఆయనకు ఆలయ చరిత్ర వివరించారు.


ఉమామహేశ్వరుడి ఆలయ ఆవరణలో అమరేందర్‌రెడ్డి, కుటుంబీకులు

తప్పిపోయిన యువకుడు

- తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు


ఆంజనేయులు (ఫైల్)

బల్మూరు, మే 15 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలోని కొండనాగుల గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే యువకుడు తప్పిపోయాడు. గత కొంతకాలంగా యువకుడు మానసిక వ్యాధితో ఇబ్బంది పడుతూ ఈ నెల 12న ఇంటి నుంచి బయట తిరిగి వస్తానని వెళ్లి మళ్లీ రాక పోవడంతో తల్లి సైదమ్మ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో చుట్టూ పక్కల ఉన్న బంధుమిత్రులతో కలిసి వెతికినప్పటికీ దొరకలేదు. పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేస్తామని ఎస్ఐ బాలరాజు తెలిపారు.

బాలిక మృతిపై కేసు నమోదు

బల్మూరు, మే 15 : నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరుకు చెందిన భాగ్యలక్ష్మి(16) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అమ్మాయి తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు బుధవారం ఎస్ఐ బాలరాజు తెలిపారు. ఈ నెల 13న ఈ సంఘటన జరిగిందని, ఇదే గ్రామానికి చెందిన రాఘవేందర్ అనే యువకుడు అమ్మాయిని ప్రేమిస్తున్నానని గ్రామానికి సమీపంలో ఉన్న కురువనికుంటలో అమ్మాయిని పిలిపించి పురుగుల మందు తాగించినట్లు మృతురాలి తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ బాలరాజు తెలిపారు. కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉండడాన్ని గమనించి చికిత్స నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఈత చెట్లను దహనం చేసిన దుండగులు

పెబ్బేరురూరల్, మే 15 : వనపర్తి జిల్లా పెబ్బేరు మండల పరిధిలోని కంచిరావుపల్లి గ్రామ శివారులో దాదాపు 500 ఈత చెట్లను గుర్తు తెలియని దుండగులు కాల్చివేశారని గౌడ సంఘం జేఏసీ జిల్లా అధ్యక్షుడు మాలపల్లిగౌడ్, వనపర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్, సంఘం పెబ్బేరు మండల అధ్యక్షుడు కె.రాజశేఖర్‌గౌడ్‌లు తెలిపారు. బుధవారం వారు సంఘం నాయకులు బసవరాజుగౌడ్, వెంకటన్న గౌడ్ తదితరులతో కలిసి ఘటనా స్థలానికి వెళ్లారు. పరిశీలించిన వారు కొత్తకోట ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కరుణకు వీడియోకాల్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఈత చెట్లను కాల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.


కంచిరావుపల్లి సమీపంలో ఈత చెట్లను కాల్చిన దుండగులు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గద్వాల, మే 15 : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని వీరాపురం గ్రామానికి చెందిన గొల్ల చిన్నబీచుపల్లి (55) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిన్న బీచుపల్లి మంగళవారం పూడూరు బ్యాంకుకు వెళ్లి పని ముగించుకొని మోటార్ బైక్‌పై గ్రామానికి తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో లక్ష్మన్న అనే వ్యక్తి గద్వాల నుంచి ఇటిక్యాలకు మోటార్ బైక్‌పై వెళ్తున్నాడు. పూడూరు శివారులో రెండు బైక్‌లు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన చిన్న బీచుపల్లిని గద్వాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూల్‌కు తీసుకెళ్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. భార్య మహాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ పర్వతాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

- ఒకరి పరిస్థితి విషమం

ఎర్రవల్లి, మే 15 : జోగుళాంబ గద్వాల జిల్లా కొండేరు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొండేరు గ్రామానికి చెందిన ప్రభుదాస్, తేజలు ద్విచక్రవాహనంపై గద్వాల నుంచి స్వగ్రామానికి వస్తుండగా మార్గం మధ్యలో ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నారు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. ప్రభుదాస్ పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

అకాల వర్షాలకు గొర్రెల మృతి

మక్తల్, మే 15 : అకాల వర్షాలతో పాటు రోగం సోకి 31 గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మునిసిపాలిటీ పరిధిలోని కొత్తగార్లపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కొత్తగార్లపల్లికి చెందిన గుండు కిష్టప్ప గొర్రెలను గ్రామ సమీపంలోని మందలో ఉంచాడు. అకాల వర్షాలకు పాటు రోగం సోకి 31 గొర్రెలు మృతి చెందాయి. వీటి విలువ రూ.నాలుగు లక్షలకు పైగా ఉంటుందని బాధితుడు తెలిపారు. పశువైద్య అధికారులు గొర్రెల మంద వద్దకు వెళ్లి గొర్రెలను పరిశీలించి పాటు రోగం సోకినట్లు నిర్ధారించారు. మిగతా గొర్రెలకు ఈ రోగం సోకకుండా మందులు అందించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోస్గి రూరల్, మే 15 : ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో రేషన్ బియ్యం పట్టుబడింది. వివరాల్లోకి వెళ్తే.. నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో బుధవారం హైదరాబాద్ నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రత్యేక బృందం పలు ధాన్యం దుణాలను తనిఖీ చేయగా, ఓ దుకాణంలో ఐదు క్వింటాళ్ల పట్టుబడ్డా యి. సదరు దుకాణదారుడు నర్సిములుపై కేసు నమోదు చేసి, ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఆనంద్ పంచనామ నిర్వహించి రేషన్ దుకాణం 6కు బియ్యం అప్పగించారు. కాగా మరో మూడు దుకాణాలను సీజ్ చేయగా, దుకాణదారులు మొదట స్పెషల్ బృందమని రాకుండా రెండు గంటల తరువాత వచ్చి దుకాణాలు తెరిచారు. కానీ ఆ దుకాణాల్లో ఎలాంటి సరుకు దొరకలేదని డీటీ ఆనంద్ తెలిపారు.

బస్టాండ్‌లో మూత్రశాలకు దారేది ..?

కొత్తకోట, మే 15 : పట్టణంలోని బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారని ఆరోపణలు లేకపోలేదు. దూర ప్రాంతాలకు వెళ్లడానికి వచ్చే ఇతర గ్రామాల ప్రయాణికులు మాలమూత్ర విసర్జనాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. రెండురోజులుగా చిన్నపాటి వర్షాలు కురవడంతో బస్టాండ్ ప్రాంగణ సమీపంలో ఉన్న మూత్రశాల చుట్టు మురికినీరు నిలిచాయి. దీంతో మూత్రశాల గదిలోకి ఎవరూ వెళ్లలేకపోతున్నారు. మురికినీరు దిగువకు పోవడానికి సౌకర్యం లేకుండా ఉంది. అలాగే మరుగుదొడ్ల మ్యాన్‌హోల్ నుంచి నీళ్ల బయటకు వచ్చి దుర్వాసన వస్తోంది. ప్రయాణికులు బస్టాండ్ మూత్రశాల అంటేనే బయపడుతూ ముళ్ల పొదల్లోకి పోవాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు స్పందించి మురికినీరు బయటకు పోవడానికి దారి ఏర్పాటు చేస్తూ మరుగుదొడ్ల మ్యాన్‌హోల్‌ను పరిశుభ్రం చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


చిన్నపాటి వర్షానికి మూత్రశాల ముందు నిలిచిన మురుగునీరు

రైతులకు వరం.. నీటి నిల్వ కుంటలు

వెల్దండ, మే 15 : రైతుల వ్యవసాయ పొలాల వద్ద ఏర్పాటు చేసుకుంటున్న నీటినిల్వ కుంటలు (పాంపాండ్స్) వరంలా మారుతున్నాయి. మండు వేసవిలో కూడా రైతులు తమ పంటలను సాగుచేసుకునేందుకు అవసరమైన నీటిని నిల్వచేసుకునే వీలు కలుగుతుంది. బోర్లు, బావులు ఎండిపోవడం, చాలావరకు భూగర్భ జలాలు తగ్గిపోవడంతో రైతులు వ్యవసాయం చేయలేక సతమతమవుతున్నారు. ఈ క్రమంలో తమ పొలాల్లో పెద్ద గుంతలను జేసీబీల సహాయంతో ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రత్యేకంగా తయారు చేసిన పాలిథిన్ కవర్‌ను గుంతలలో వేసి పాంపాండ్ ఏర్పాటు చేసుకుంటున్నారు. అసలే వేసవిలో అరకొరగా నీరందించే బోరు నీళ్లను తయారుచేసుకున్న నీటి కుంటలో నిల్వచేసుకుంటున్నారు. చాలీచాలని విద్యుత్, కొద్దిపాటి పోసే బోరు నీళ్లతో కొన్ని సందర్భాలలో మోటార్లు కాలిపోతుండడంతో పాటు తమ పొలాలకు సక్రమంగా సాగునీరు అందించలేకపోయేవారు. కాగా పాంపాండ్‌లో మోటారు ఏర్పాటు చేసుకుని తమ అవసరాలకు అనుగుణంగా ఏకమొత్తంలో పంటలకు నీరు అందిస్తున్నారు. పాంపాండ్ ఏర్పాటుతో మండలంలోని రైతులు పెద్దఎత్తున వరి, వేరుశనగ పంటలను పండిస్తున్నారు. వీటితో సాగు విస్తీర్ణం పెరిగిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖల ద్వారా సబ్సిడీపై తమకు గుంతల ఏర్పాటుకు, కవర్ కొనుగోలుకు సహకరించాలని కోరుతున్నారు.


కొట్రలో రైతు ఏర్పాటు చేసుకున్న నీటినిల్వ కుంట

సాగు విస్తీర్ణం పెరిగింది



గత ఐదేళ్లక్రితం పొలంలో నీటినిల్వ గుంత ఏర్పాటు చేసుకున్నాను. అసలే చాలీచాలని నీళ్లతో గతంలో తీవ్ర ఇబ్బంది పడేవాడిని. పాంపాండ్ నిర్మించాక కొద్దిపాటి నీళ్లతో ప్రతీ ఏడాది సుమారు 10 ఎకరాల వరకు వేరుశనగ సాగుచేస్తున్నాను. ఇంతకుముందు పశువులకు తాగునీటికి సైతం ఇబ్బంది పడేవాడిని. ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తే సాగునీటి బాధలు తప్పుతాయి.

\- రవి, రైతు, కొట్ర

రైతుల సహకారంతో డీసీసీబీకి లాభాలు

- ఈ ఏడాది రూ.12 కోట్ల ప్రాఫిట్
- డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య

పాలమూరు, మే15 : ఉమ్మడి జిల్లాలోని రైతుల సహకారంతో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ రూ.12కోట్ల లాభాల్లో నడుస్తోందని డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 78ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, 22శాఖలు, 360వ్యవసాయేతర సహకార సంఘాల ద్వారా జిల్లా రైతాంగానికి రుణ సహాయం చేస్తున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్న సహకార బ్యాంకు 2023-24ఆర్థిక సంవత్సరంలో ఉత్తమ ప్రగతిని సాధించినమని చెప్పటానికి సంతోషిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్లు డి.బక్కన్నయాదవ్, ఈ.రంగారెడ్డి, కె.నరసింహారెడ్డి, సత్తు భూపాల్‌రావు, కె.యస్.లక్ష్మీనారాయణ, పి.నరసింహులు, యం.చంద్రనాయక్ పాల్గొన్నారు.

చెరువుల పనులు పరిశీలించిన ఈజీఎస్ అధికారులు

అమ్రాబాద్, మే 15: అమ్రాబాద్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం (మానస సరోవర్)లో భాగంగా జరిగిన చెరువుల అభివృద్ధి పనుల తనిఖీల్లో భాగంగా ఈజీఎస్ రాష్ట్ర క్వాలిటీ కంట్రోలర్ కృష్ణారావు, జిల్లా అధికారులు పవన్ కుమార్, క్రాంతి బుధవారం పరిశీలించారు. మండలంలోని అమ్రాబాద్, మాచారం, వెంకటేశ్వర బావి, మన్ననూర్ తదితర గ్రామాల్లో ఈ పథకం పనులను పరిశీలించారు. గత రెండు సంవత్సరాల క్రితం ఈ పనులను ఉపాధి హామీ పథకంలో చేయించడంతో ప్రస్తుతం ఈ చెరువులలో ఉన్న వాటర్ లెవెల్‌తో పాటు ఏ మేరకు రైతులకు ప్రయోజనం కలుగుతుదనే విషయాలను వారు పరిశీలించారు. ఈజీఎస్ మండల ఈసీ రేనయ్య, టెక్నికల్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

గండీడ్ మండలంలో వర్షం



రంగారెడ్డిపల్లి కొనుగోలు కేంద్రంలో వర్షం నీటిలోనే ఉన్న ధాన్యం కుప్పలు

గండీడ్, మే 15: మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండల పరిధిలోని రంగారెడ్డి పల్లి, గండీడ్, రెడ్డిపల్లి, సల్కర్‌పేట్ తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఉరుములతో కూడిన వర్షం కురిసింది. ధాన్యం కల్లాల్లో ఉండటంతో రైతులు ఇబ్బంది పడ్డారు. కొనుగోలు కేంద్రాల దగ్గర ఉన్న ధాన్యంపై టార్పాలిన్లు కప్పారు. కాని వరి కుప్పల కిందకు నీరు చేరడంతో స్వల్పంగా వడ్లు తడిచాయి. చిన్నపాటి వర్షం కురవడంతో రైతన్నలు ఊపిరి పీల్చుకున్నారు.

అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు డాక్టర్ ప్రతిభ

- దేశంలో ముగ్గురికి ఆహ్వానం
- మహిళల్లో ఊబకాయం-ఫంక్షనల్ మెడిసిన్ పాత్రపై ప్రసంగం



వివరాలు తెలుపుతున్న డాక్టర్ ప్రతిభ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మే 15: ఏషియా, ఓషియానా ఫెడరేషన్ ఆఫ్ అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజి ఆధ్వర్యంలో ఈనెల 16నుంచి 20 వరకు కొరియాలోని భూసాన్ నగరంలో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సుకు మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సుశ్రుత ప్రజావైద్యశాల ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ ప్రతిభకు ఆహ్వానం లభించింది. ఈమేరకు ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె సదస్సుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అంతర్జాతీయ దేశాల నుంచి గైనకాలజి డాక్టర్లు ఈ సదస్సుకు హాజరవుతారని, మన దేశం నుంచి ముగ్గురికి మాత్రమే ఆహ్వానం వచ్చిందన్నారు. అందులో ఢిల్లీ, ముంబైకి చెందిన ఇద్దరు గైనకాలజిస్టులతో పాటు తనకు ఈ ఆహ్వానం వచ్చిందని, ఈనెల 16 నుంచి 20 వరకు నాలుగు రోజుల పాటు ఈ సదస్సు ఉంటుందన్నారు. రెండో రోజు 18న తన ప్రసంగం ఉంటుందని, ఊబకాయం ఉన్న మహిళల్లో ఫంక్షనల్ మెడిసిన్‌కు సంబంధించిన పాత్ర ఎలా ఉంటుందనే అంశంపై తాను మాట్లాడతానని పేర్కొన్నారు. మన దేశంలో ఊబకాయం వలన మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అది వచ్చే మార్గాలు, రాకుండా తీసుకునే జాగ్రత్తలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేస్తానని అన్నారు. దీంతో పాటు వివిధ దేశాల్లో ఊబకాయం, గర్భిణులకు సంబంధించి అత్యాధునిక పరిజ్ఞానంతో అందిస్తున్న వైద్యం గురించి తెలుసుకొని ఇక్కడి ప్రజలకు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

మామిడి చెట్లను నరికేసిన ఫారెస్టు అధికారులు

- జీవనోపాధి కోల్పోయామని కన్నీరుమున్నీరైన రైతులు



తిర్నాంపల్లి శివారులో ఫారెస్టు అధికారులు తొలగించిన మామిడి చెట్లు

పెద్దకొత్తపల్లి, మే 15 : ఎన్నో ఏళ్లుగా కష్టపడి నాటిన మామిడిచెట్లను ఫారెస్టు అధికారులు నరికేశారని బాధిత రైతు మన్నెమోని వెంకటయ్య పేర్కొన్నారు. బాధిత రైతు వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం... పెద్దకొత్తపల్లి మండలం తీర్నాంపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబరు 55/ఆ/2లో 17ఏళ్ల క్రితం నాటిన 55మామిడి చెట్లను, మూడేళ్ల క్రితం నాటిన 80మామిడి చెట్లను బుధవారం ఉదయం ఫారెస్టు అధికారులు నరికేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దపెద్ద మామిడి చెట్లను నరికేయడంతో తాము జీవనోపాధి కోల్పోయామని కన్నీరుమున్నీరయ్యారు. ఈ విషయమై ఫారెస్టు అధికారులపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు వెంకటయ్య తెలిపారు.

అటవీ భూమిలో నాటినందుకే తొలగించాం

తీర్నాంపల్లి గ్రామ శివారులోని అటవీ భూముల్లో రైతులు నాటిన చిన్న చిన్న మొక్కలను తొలగించామని కొల్లాపూర్ ఫారెస్టు రేంజర్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. అటవీ భూమిలో నాటినందుకే 30 చిన్న మొక్కలను తొలగించామని, భూమికి సంబంధించి రైతు దగ్గర ఎలాంటి హక్కు పత్రాలు కూడా లేవని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా అటవీ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకుంటే వారిపై ఫారెస్టు యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

రంజీ ట్రోఫీకి పాలమూరు కుర్రాడు

- 20 ఏళ్ల తరువాత అవకాశం
- క్రికెట్‌లో రాణిస్తున్న యువ కెరటం గణేశ్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 15: నిరుపేద కుటుంబానికి చెందిన మహబూబ్‌నగర్ యువకుడు గణేశ్ ఖరీదైన క్రికెట్ ఆటలో రాణిస్తున్నాడు. ఆర్థిక స్థోమత లేకపోయినా క్రికెట్‌పై కుమారుడి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ప్రోత్సహించడంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) పరిధిలోని అండర్-14,16,19, సీనియర్స్ విభాగాల్లో ఆడి ప్రతిభ చాటాడు. మహబూబ్‌నగర్‌కు చెందిన గణేష్ ఈ ఏడాది హైదరాబాద్‌లో నిర్వహించిన హెచ్‌సీఏ జోనల్స్ పోటీల్లో సత్తాచాటి ప్రతిష్టాత్మక రంజీ ట్రోఫీల్లో పాల్గొనే హెచ్‌సీఏ జట్టుకు ఎంపికైయ్యాడు. ఫిబ్రవరి 17 నుంచి హైదరాబాద్‌లో మిజోరాం జట్టుతో జరిగిన రంజీ ట్రోఫీ టోర్నీలో హెచ్‌సీఏ జట్టు తరుపున 15 మంది తుది జట్టు సభ్యుల్లో చోటు దక్కించుకొని 20 ఏళ్ల తర్వాత రంజీ ట్రోఫీలో చోటు దక్కించుకొని రికార్డు నెలకొల్పాడు. ఆయన ఎదుగుదలలో మహబూబ్‌నగర్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజశేఖర్ కృషి ఉన్నది.



బ్యాటింగ్ చేస్తున్న గణేశ్(ఫైల్)

నిరుపేద కుటుంబం..

నారాయణపేట జిల్లా మరికల్ మండలం వెంకటాపూర్‌కి చెందిన గణేశ్‌ది నిరుపేద కుటుంబం, తండ్రి రమేశ్ హమాలీగా పనిచేస్తుండగా, తల్లి సుధా టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరు 15ఏళ్ల కిందట మహబూబ్‌నగర్‌కు వచ్చి వలసవచ్చారు. ఎంతో ఖరీదైన ఆట క్రికెట్‌పై ఆసక్తి చూపడం.. అందుకు అవసరమైన వేలాది రూపాయల కిట్లు కొనుగోలు చేయలేని పరిస్థితి తల్లిదండ్రులది. అయితే అప్పోసప్పో చేసి కుమారుడిని మైదానానికి పంపించారు. ఆయనలోని ప్రతిభను గుర్తించి క్రికెట్ సంఘం కార్యదర్శి రాజశేఖర్ ప్రోత్సాహం అందించారు. కోచ్ అబ్దుల్లా ఆధ్వర్యంలో క్రికెట్‌లో శిక్షణ పొందాడు.



తల్లిదండ్రులతో గణేశ్

ఇన్నింగ్స్ 137, రెండో ఇన్నింగ్స్‌లో 73 పరుగులతో రాణించాడు. సికింద్రాబాద్ లెవెన్ జట్టుతో జరిగిన రెండో మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ 49, రెండో ఇన్నింగ్స్‌లో 91 పరుగులు చేసి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించాడు. మొదట హెచ్‌సీఏ మెయిన్ టీంలో స్టాండ్‌బైగా ఉన్నాడు. ఆ తర్వాత ఫిబ్రవరి 17నుంచి ఐదు రోజుల పాటు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియంలో నిర్వహించిన రంజీట్రోఫీ మ్యాచ్‌లో మిజోరాం జట్టుతో ఆడిన ఫైనల్స్‌లో సత్తాచాటి హెచ్‌సీఏ తుది జట్టుకు ఎంపికయ్యాడు.

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే 3డే, 2డే లీగ్ టోర్నీలతో పాటు ఎస్‌జీఎఫ్ పోటీల్లో రాణించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 3డే లీగ్ పోటీల్లో తెలంగాణ కంబైన్డ్ జిల్లాల జట్టులో చోటు దక్కించు

బ్యాట్ పడితే పరుగుల వరదే..

కున్నారు. గత ఏడాది జూలై 2022-23 సీజన్‌లో జరిగిన హెచ్‌సీఏ జోనల్స్ టోర్నీలో తెలంగాణ కంబైన్డ్ జిల్లాల జట్టు తరుపున రెండు మ్యాచ్‌లో 287 పరుగులు, రెండు వికెట్లు తీశారు. ఇన్‌కం టాక్స్ శాఖ జట్టుపై 104 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 61 పరుగులు చేశాడు. ఇండియన్ సిమెంట్ జట్టుపై 44 పరుగులు, ఎవర్‌గ్రీన్ జట్టుపై 36 పరుగులు, ఒక వికెట్ తీశారు. యూబీఐ జట్టుపై 33 పరుగులు, ఈస్ట్‌మారెడ్‌పల్లి జట్టుపై తొమ్మిది పరుగులు, ఒక వికెట్ తీశారు. 2020లో నిర్వహించిన 3డే లీగ్‌లో ఎనిమిది మ్యాచుల్లో 609 పరుగులు చేసి, ఆరు వికెట్లు పడగొట్టాడు. ఇదే ఏడాది నిర్వహించిన 2డే లీగ్‌లో జిల్లా జట్టు తరుపున ఆడి రాజు క్రికెట్‌పై 318 నాటౌట్(ట్రిపుల్ సెంచరీ), అదే ఏడాది జరిగిన డబ్ల్యూసీసీ జట్టుపై 329(మరో ట్రిపుల్ సెంచరీ) సాధించి సరికొత్త చరిత్ర సృష్టించాడు. 2021లో నిర్వహించిన 3డే లీగ్ ఆరు మ్యాచ్‌ల్లో 228 పరుగులు, 11 వికెట్లు తీసి ప్రతిభ చాటారు.

జోనల్స్‌లో సత్తాచాటి..

హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పరిధిలోని 2023-24 సీజన్‌లో నిర్వహించిన జోనల్స్ పోటీల్లో తెలంగాణ కంబైన్డ్ జిల్లాల జట్టు తరుపున ఆడి రాణించాడు. రెండు మ్యాచుల్లోని రెండు ఇన్నింగ్స్‌లలో 350 పరుగులు చేశాడు. సెక్రటరీ లెవెన్ జట్టుతో నిర్వహించిన మ్యాచ్ మొదటి



ఎంపీఎల్ లీగ్ మ్యాన్ ఆఫ్ ది సిరీస్(బైక్)తో గణేశ్(ఫైల్)

ఇండియా జట్టుకు ఆడాలన్నదే లక్ష్యం



జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి రాజశేఖర్ కృషి, కోచ్ అబ్దుల్లా సార్ ఇచ్చిన శిక్షణ వల్లే రంజీ జట్టుకు ఎంపికయ్యాను. రంజీ ట్రోఫీ సీనియర్ క్రీడాకారులు తిలక్‌వర్మ, సీవీ మిలింద్, రాహుల్‌సింగ్ సూచనలు, సలహాలు తీసుకున్నాను. భారత జట్టుకు ఆడాలన్నదే నా లక్ష్యం.

-గణేశ్, రంజీ క్రీడాకారుడు, మహబూబ్‌నగర్

20 ఏళ్ల తరువాత అవకాశం



మహబూబ్‌నగర్ నుంచి 20 ఏళ్ల కింద గౌస్ బాబా రంజీ ట్రోఫీ ఆడాడు. తాను జిల్లా క్రికెట్ సంఘం బాధ్యతలు చేపట్టి 15 ఏళ్లు అయ్యింది. గ్రామీణ క్రీడాకారులు, ప్రతిభ గల క్రీడాకారులు శిబిరాల్లో వెలుగులోకి వచ్చారు. రంజీ జట్టుకు గణేశ్ ఎంపికయ్యేందుకు కృషి చేశాం. భారత జట్టుకు ఎంపికావలన్నదే నా ఆకాంక్ష. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటాం.

-రాజశేఖర్, జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ

కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌కు వనపర్తి యువకుడికి ఆహ్వానం

- వేడుకలకు ఎంపికైన ఇన్ రీ ట్రీట్ సినిమా
- ఆ సినిమాకు ఎడిటర్‌గా పని చేసిన పట్టణానికి చెందిన రాఘవేందర్

వనపర్తి రాజీవ్ చౌరస్తా, మే 15 : వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు ఉప్పుగంటి రాఘవేందర్ సినిమా ఎడిటర్‌గా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకొని అంతర్జాతీయ సినిమా వేడుకల్లో మెరిసే అవకాశాన్ని దక్కించుకున్నాడు. ఫ్రాన్స్‌లో 77వ కేన్స్ ఫిలిం ఫెస్టివల్ వేడుకలు ఈనెల 14వ నుంచి 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఉప్పుగంటి రాఘవేందర్ ఎడిటర్‌గా పని చేసిన ఇన్ రీ ట్రీట్ అనే సినిమా కూడా ఈ వేడుకల్లో ప్రదర్శనకు ఎంపికైంది. ఈ నేపథ్యంలో రాఘవేందర్‌ను కూడా వేడుకలకు ఆహ్వానిస్తు నిర్వాహకులు సందేశాన్ని పంపారు. ఈ అరుదైన ఘనతను సొంతం చేసుకున్న ఉప్పుగంటి రాఘవేందర్‌ను వనపర్తి పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు.

ఇదీ కుటుంబ నేపథ్యం

వనపర్తి పట్టణానికి చెందిన ఉప్పుగంటి యాదగిరి, భారతి దంపతుల ప్రథమ సంతానం రాఘవేందర్. ఆయనకు ఓ చెల్లి కూడా ఉంది. ఆమె బయో టెక్నాలజీలో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు డయాగ్నోస్టిక్ సెంటర్‌లో పని చేస్తున్నారు. రాఘవేందర్ తాత నారాయణ పట్టణంలో ప్రముఖ పెయింటర్, ఫొటోగ్రాఫర్ కూడా. వనపర్తి సంస్థానాధీశుల కాలం నుంచి తన వృత్తిలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారు.

ఇంటర్ వరకు వనపర్తిలోనే విద్యాభ్యాసం

రాఘవేందర్ వనపర్తి పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో పదవ తరగతి చదివాడు. అనంతరం స్థానికంగానే ఉన్న సీవీ రామన్ జూనియర్ కళాశాలలో ఎంపీసీ గ్రూపులో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. తరువాత మహబూబ్‌నగర్‌లోని స్విట్స్ కళాశాలలో సీఎస్‌ఈ గ్రూపులో ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేశాడు. అనంతరం ఆయన 2012-18 కాలంలో పుణేలోని ఫిలిం టెలివిజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియాలో ఫిలిం ఎడిటింగ్ విభాగంలో పీజీ డిప్లోమా పూర్తి చేశాడు. ప్రస్తుతం ఫిలిం ఫెస్టివల్ వేడుకలకు ఎంపికైన ఇన్ రిట్రీట్ సినిమా దర్శకుడు మైజమ్‌అలీ కూడా రాఘవేందర్‌తో పాటు ఇక్కడే దర్శకత్వ విభాగంలో పీజీ డిప్లోమా పూర్తి చేశారు.



రాఘవేందర్‌ను సన్మానిస్తున్న తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ(ఫైల్)

మూడు చిత్రాలకు ఎడిటింగ్

ఉప్పుగంటి రాఘవేందర్ ఇప్పటివరకు మూడు చిత్రాలకు ఎడిటర్‌గా పనిచేశాడు. ఆయన ఎడిటింగ్ చేసిన తొలి చిత్రం మల్లేశం(2019). చేనేత కార్మికుల వృత్తికి, జీవితాలకు సంబంధించిన ఇతివృత్తం ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. నేత కార్మికుడైన మల్లేశం ఆసు యంత్రాన్ని రూపొందించి దాని సాయంతో నేత కార్మికుల పని సులభతరం అయ్యేలా చేశాడు. నల్గొండ జిల్లా ఆలేరు గ్రామానికి చెందిన చింతకింది మల్లేశం యదార్థ గాథను మల్లేశం చిత్రం ద్వారా తెలియజేశారు. రాఘవేందర్ ఎడిటింగ్ చేసిన మరో చిత్రం హౌజ్ దట్ ఫార్ మండే. ఆంగ్లంలో నిర్మితమైన ఈ చిత్రం ఈటీవీ విన్‌లో 2023 డిసెంబర్ ఏడున విడుదలైంది. సోమవారం జరిగే కొన్ని సంఘటనల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కించారు. ఈ సినిమా కూడా ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది. ప్రస్తుతం రాఘవేందర్ ఎడిటర్‌గా పనిచేసిన ఇన్ రిట్రీట్ చిత్రాన్ని భారత్‌లోని లద్దాక్ ప్రాంతంలో ఐదునెలల పాటు చిత్రీకరించారు. 30 సంవత్సరాల కిందట ఊరు వదిలి వెళ్లిన వ్యక్తి తిరిగి తన సొంత గ్రామానికి వచ్చి పొందిన మానసిక ఉద్వేగాల సమాహారమే ఈ చిత్రం. ఈ సినిమా నిడివి 1:15 గంటలు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో జరుగుతున్న కేన్స్ ఫిలిం ఫెస్టివల్ వేడుకల్లో యాసిడ్ విభాగంలో మొట్టమొదటిసారిగా భారత్ తరపున ప్రదర్శించడానికి గాను ఈ చిత్రం ఎంపికైంది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 20వ తేదీన ఈ చిత్రం ప్రదర్శితం కానుంది.



రాజాపూర్‌లో ఏర్పాటు చేసిన ఓ ఆర్‌ఎంపీ క్లినిక్

ఆర్‌ఎంపీలపై నియంత్రణ ఏదీ?

- పుట్టగొడుగుల్లా క్లినిక్‌లు
- శిక్షణ లేకుండా ఎవరు పడితే వారు ఏర్పాటు
- తమకు సంబంధం లేదంటున్న వైద్య ఆరోగ్యశాఖ

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) మే 15: గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీలపై నియంత్రణ వ్యవస్థ లేకపోవడంతో క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. అటు ప్రభుత్వం నుంచి ఏ ఒక్క నిబంధన లేకపోవడంతో ఎవరు పడితే వారు క్లినిక్‌లను ఏర్పాటు చేసుకుంటున్నారు. కనీసం జిల్లాలో ఎంతమంది ఆర్‌ఎంపీలు ఉన్నారో వారి యూనియన్‌కే తెలియని పరిస్థితి నెలకొంది. ఎలాంటి వైద్యం చేస్తున్నారు... ఏం మందులు ఇస్తున్నారో... ప్రజల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపుతున్నాయి అనే విషయంపై కూడా ఏ ఒక్కరు ఆలోచించకపోవడం గమనార్హం. అయితే ఆర్‌ఎంపీల వ్యవస్థపై తమకు ఎలాంటి సంబంధం లేదని, ఎక్కడైనా వైద్యం వికటించినట్లు ఫిర్యాదు వస్తే తప్పా తాము ఏం చేయలేమని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతుండడం విశేషం.

వైఎస్ హయాంలో ఆర్‌ఎంపీలకు శిక్షణ..

2008లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వైద్యరంగంలో పలు మార్పులు తీసుకొచ్చే క్రమంలో ఆర్‌ఎంపీలను కూడా భాగస్వాములను చేయాలని వారికి శిక్షణ తరగతులు నిర్వహింపజేశారు. దీని ప్రకారం పారామెడికల్ బోర్డు కింద వారిని రిజిస్టర్ చేయించి తొమ్మిది నెలల పాటు ఆయా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని డాక్టర్లతో శిక్షణ ఇప్పించారు. ఇందులో భాగంగా మూడు నెలలు థీయరి, మూడు నెలలు ప్రాక్టికల్స్, మరో మూడు నెలలు క్షేత్రస్థాయిలో శిక్షణ ఇచ్చారు. ఇందులో కూడా కేవలం 50 శాతం మంది మాత్రమే శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఇదిలా ఉండగా శిక్షణ పూర్తయిన వారికి పరీక్షలు నిర్వహించి వారికి గుర్తింపు ఇవ్వాలని భావించారు. కాని అప్పుడే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చనిపోవడంతో అది పూర్తిగా ఆగిపోయింది.

శిక్షణ తీసుకున్న వారు సగం మందే..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అప్పటి పారా మెడికల్ బోర్డు రిజిస్టర్ ప్రకారం 2,980 మంది ఆర్‌ఎంపీలు ఉన్నారు. అందులో శిక్షణ తీసుకున్న వారు 50 శాతం మంది మాత్రమే. మిగతా వారు సగం శిక్షణతోనే ఆపేశారు. అయితే ప్రస్తుతం మాత్రం ఎంత మంది ఉన్నారో ఎవరికీ తెలియని పరిస్థితి. కనీసం ఆర్‌ఎంపీల సంఘాలలో కూడా నమోదుకాని వారు ఎంతోమంది ఉన్నారు. ఇదిలా ఉండగా వైద్య ఆరోగ్యశాఖ వద్ద కూడా ఆర్‌ఎంపీలకు సంబంధించిన వివరాలు లేవు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు ఐదు వేల మంది వరకు ఆర్‌ఎంపీలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలు విడిపోయిన తర్వాత ప్రతీ జిల్లాలో 300 నుంచి 400 వరకు కొత్త ఆర్‌ఎంపీలు పెరిగినట్లు సమాచారం. ప్రస్తుతం ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లు పుట్టగొడుగుల్లాగా వెలిశాయి. ఎవరు పడితే వారు క్లినిక్‌లు పెట్టుకున్నారు. దీనికి ఓ విద్యార్హతగానీ, విధి విధానాలుగానీ, నియమ నిబంధనలు గానీ లేకపోవడంతో ఇష్టారీతిగా క్లినిక్‌లు పెడుతున్నారు. కొద్దిగా రాజకీయ అండదండలు ఉన్నాయంటే చాలు రెండు మూడు క్లినిక్‌లు కూడా పెట్టేస్తున్నారు.

నియంత్రణ ఏదీ

ఆర్‌ఎంపీలపై నియంత్రణ అనేది లేకుండా పోయింది. ఎవరు క్లినిక్‌లు పెడుతున్నారు... వారికి ఎలాంటి అర్హత ఉంది... ఎలాంటి మందులు రాస్తున్నారు. ఆ మందుల ప్రభావం ప్రజలపై ఎంతవరకు పడుతుంది అనే అంశాలపై ఎవరు ఆలోచించడం లేదు. ఇవన్నీ చూడాల్సిన వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తమకు సంబంధం లేదని చెబుతున్నారు. ఎక్కడైనా వైద్యం వికటించినా, ఎవరైనా ఫిర్యాదు చేస్తే అక్కడికి వెళ్లి వారి క్లీనిక్‌లను సీజ్ చేస్తామే తప్పా ఎవరు క్లీనిక్‌లు పెట్టుకోవాలి, ఎవరు పెట్టుకోవద్దు..ఎలాంటి విద్యార్హతలు ఉండాలి అనే అంశం తమ పరిధిలోకి రాదని చెప్పడం విశేషం. ఆర్‌ఎంపీలపై నియంత్రణ లేకపోవడం వలన విచ్చలవిడిగా క్లినిక్‌లను ఏర్పాటు చేసుకొని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. అనవసరమైన యాంటిబయోటిక్స్ అంటగడుతూ, స్థాయికి మించి వైద్యం చేస్తున్నారు.

తప్పిన పెను ప్రమాదం

- లారీలో తరలిస్తున్న గడ్డి మోపులకు నిప్పు
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ముప్పు



తాడూరు మండలం యత్మతాపూర్‌లో లారీలో తగులబడిన గడ్డిని ఆర్పుతున్న గ్రామస్థులు

తాడూరు, మే 15 : నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలోని యత్మతాపూర్ గ్రామంలో బుధవారం లారీలో రైతులు గడ్డికట్టలను తరలిస్తున్న క్రమంలో విద్యుత్ వైర్లు తగులుకుని మంటలు అంటుకున్నది. దీంతో డ్రైవర్ గమనించి వెంటనే లారీని ఆపాడు. గ్రామస్థుల సహకారంతో నీళ్లు చల్లుతూ గడ్డికట్టలను కిందకి విసిరేసి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో లారీతో పాటు ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

ఎవరు కన్న బిడ్డో..

- గద్వాల ఆస్పత్రిలో శిశువును వదిలి వెళ్లిన గుర్తు తెలియని మహిళలు
- శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చికిత్స



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వదిలేసి వెళ్లిన శిశువు

గద్వాల క్రైం, మే 15 :ఎవరి కన్న బిడ్డో ఏమో.. ఎందుకు వదిలేశారో తెలియదు కానీ, రెండు నెలల శిశువును ఇద్దరు గుర్తు తెలియని మహిళలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మంగళవారం రాత్రి ఇద్దరు గుర్తు తెలియని మహిళలు వచ్చారు. రెండు నెలల మగ శిశువును చిన్నపిల్లల వార్డు ప్రక్కన వదిలేసి వెళ్లిపోయారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. కొద్ది సేపటికి శిశువు ఏడుపు వినిపించడంతో అక్కడే ఉన్న కొందరు రోగులు ఈ విషయాన్ని సిబ్బందికి తెలిపారు. వారి సమాచారం మేరకు చిన్నపిల్లల వైద్యుడు శ్యామ్ శిశువుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బాబు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించి అవసరమైన చికిత్స అందించారు. అనంతరం జిల్లా సంక్షేమాధికారి సుధారాణికి సమాచారం ఇచ్చారు. ఆమె ఆదేశం మేరకు డీసీపీవో నరసింహ, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ శివలీల ఆసుపత్రికి చేరుకొని శిశువు ఆరోగ్యంపై ఆరా తీశారు. జ్వరం ఉందని, ఇంకా చికిత్స చేయాల్సి ఉందని వైద్య సిబ్బంది ఆమెకు తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలోనే చికిత్స చేయిస్తున్నామని సుధారాణి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఈ విషయంపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. అయితే ఆ ఇద్దరు మహిళలు ఎవరు, ఆ శిశువును ఎందుకు వదిలేశారన్న విషయంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



శిశువుకు చికిత్స చేస్తున్న డాక్టర్ శ్యాం

విద్యుదాఘాతానికి గేదె మృతి

పెద్దకొత్తపల్లి, మే 15 : విద్యుదాఘాతానికి గురై ఓ గేదె మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో బుధవారం జరిగింది. బాధితుడు బొల్లె దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.... నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం దేవునితిర్మలాపూర్ గ్రామానికి చెందిన బొల్లె దేవేందర్ తన గేదెలను మేపుకురావడానికి గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలం దగ్గరకు తీసుకెళ్లాడు. మంగళవారం సాయంత్రం ఈదురుగాలులకు చెట్టుకొమ్మ విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో వైర్లు తెగి కిందపడిపోయినట్లు ఆయన పేర్కొన్నారు. గేదె కాళ్లకు వైర్లు తగలడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధితుడు తెలిపారు. గేదె విలువ 60వేలు ఉంటుందని ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతు దేవేందర్ కోరారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహాపడి పూజ



తాడూరు కొమ్ముగుట్టలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయంలో స్వామి వారికి మహాపడి పూజ నిర్వహిస్తున్న భక్తులు, అర్చకుడు

తాడూరు, మే 15 : మండల కేంద్రంలోని కొమ్ముగుట్టలో ఉన్న అయ్యప్పస్వామి దేవాలయ రెండవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామి వారికి 12మెట్లు ఏర్పాటు చేసి మహా పడి పూజా కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో కృష్ణయ్య దంపతులు పాల్గొని స్వామి వారికి అభిషేకం, పూజా కైంకర్యాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం మహాపడిపూజా కార్యక్రమానికి హాజరైన భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు అనురూప్‌శర్మతో పాటు ఎంపీటీసీ రేణుక, జడ్పీటీసీ రోహిణి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య, రమేష్, కోటేశ్వర్, కృష్ణయ్య, గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.

ఘనంగా మే డే ఉత్సవాలు



ముక్కిడిగుండం బస్టాండ్ ఆవరణలో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొల్లాపూర్, మే 15 : కొల్లాపూర్ మండల పరిధిలోని ముక్కిడిగుండం గ్రామ బస్టాండ్ ఆవరణలో బుధవారం కార్మికుల మే డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డప్పు కళా బృందంతో గ్రామ సీఐటీయూ నాయకులు ముదరకొల కృష్ణయ్య నాయకత్వంలో నల్లవెల్లి క్రాంతికుమార్ అధ్యక్షతన సీఐటీయూ నాయకుడు ఆడెం శంకరయ్య సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌లు మాట్లాడుతూ హమాలీ యూనియన్ సమస్యలపై ఐక్య పోరాటాలు నిర్వహించాలని గ్రామంలో కలిసిమెలిసి ఉండాలని కుల, మత, వర్గ, వర్ణ బేధం లేకుండా సమస్యలపై ప్రతీ ఒక్కరు స్పందించాలని గ్రామ యూనియన్ నాయకులకు పిలుపునిచ్చారు. మే డే వర్కర్స్ ఐక్యతను చాటి చెప్పే రోజుగా గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తారాసింగ్, హమాలీ యూనియన్ గ్రామ నాయకులు ఆడెం నరసింహ, రాచూరి మల్లయ్య, బూర్గం బాలపీరు, పెద్దాపురం పరమేశ్, తూల ఎల్లయ్య, తుల రాజు, సభావాత్, సేవా పాతావత్, శంకర్, బూర్గం వెంకటస్వామి, పల్లె చింతలపల్లి బాలపీరు, చెన్నయ్య, కృష్ణయ్య, నరసింహ, మహిళలు వెంకటమ్మ, లక్ష్మీ, సుభద్రతమ్మ, దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యం



వైద్య పరీక్షల అనంతరం మందులు పంపిణీ చేస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి

కల్వకుర్తి, మే 15 : ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు యాజమాన్యం అధిక ప్రాధాన్యతనిస్తుందని కల్వకుర్తి ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో సిబ్బంది సైతం తగిన జాగ్రత్తలు వహించాలని ఆమె సూచించారు. కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఆర్టీసీ గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌లో భాగంగా ఉద్యోగులకు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని బుధవారం ఆర్టీసీ డిపో మేనేజర్ సుభాషిణి ప్రారంభించారు. శిబిరంలో ఉద్యోగులకు అన్ని రకాల ప్రాథమిక పరీక్షలు, రక్తపరీక్షలు, ఈసీజీ, ఇతర పరీక్షలు నిర్వహించారు. అనారోగ్య సమస్యలున్న సిబ్బందికి హైదరాబాద్‌లోని తార్నాక సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి పంపించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అదే స్ఫూర్తితో సంస్థ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అనంతరం ఉద్యోగుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నందుకు ఎండీ.సజ్జనార్‌కు, యాజమాన్యానికి ఉద్యోగ సంఘం నాయకులు ధారా సుందర్ కృతజ్ఞతలు తెలిపారు. సీఐ శ్వేత, హెల్త్ వలంటీర్లు శేషమ్మ, ఎల్‌పీ.రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నాగర్‌కర్నూల్ టౌన్, మే 15: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరం కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ప్రారంభమయ్యాయని ఎస్సీ అభివృద్ధి జిల్లా అధికారి రాంలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ ఏడాది మార్చిలో పదో తరగతిలో 7 జీపీఏ ఆ పైన గ్రేడులు సాధించిన జిల్లాలోని జడ్పీ, ప్రభుత్వ, గురుకుల, నవోదయ, ఏయిడెడ్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు జూన్ 6న ధ్రువపత్రాల పరిశీలన, అలాట్‌మెంటు ఆర్డరు ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కల్వకోల్‌లో కంప్యూటర్ శిక్షణ



కల్వకోల్‌లో కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న యువతులు

పెద్దకొత్తపల్లి, మే 15 : కల్వకోల్ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు వేసవి సెలవుల్లో యువతీ యువకులు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందిస్తూ వారి స్వయం ఉపాధికి మార్గం కల్పిస్తున్నారు. పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామంలోని సత్యసాయి మందిరంలో ప్రత్యేకంగా కంప్యూటర్లు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. గ్రామాల్లో విద్యార్థులు, యువతీ యువకులు వేసవి సెలవులను ఈ రకంగా సద్వినియోగం చేసుకుంటున్నారు. సత్యసాయి మండల కన్వీనర్ పుల్లయ్యశెట్టి, లక్ష్మీప్రసాద్ తదితరులు సహకారంతో 80మంది విద్యార్థులు, యువతీ యువకులు కంప్యూటర్ శిక్షణనందిస్తున్నారు. కల్వకోల్ సత్యసాయి భజన మండలి మందిరంలో వేసవి సెలవుల్లో ఏప్రిల్ 25 నుంచి జూన్ 1వ తేదీ వరకు శిక్షణ ప్రారంభించారు. యువతులకు, విద్యార్థులకు బాలలకు ప్రత్యేకంగా శిక్షణనివ్వడం కోసం ప్రమోద్‌కుమార్‌ను శిక్షణకునిగా ఏర్పాటు చేశారు. ఆంగ్ల భాష నేర్పించేందుకు చంద్రకళను శిక్షకురాలిగా ఏర్పాటు చేశారు.

'వ్యక్తిగత దాడులను ఎమ్మెల్యేపై రుద్దడం భావ్యం కాదు'

మన్ననూర్, మే 15: అచ్చంపేట పట్టణంలో పుర కౌన్సిలర్ సుంకరి నిర్మల బాలరాజు కుటుంబంపై మంగళవారం జరిగిన వ్యక్తిగత కక్షల దాడులను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణపై బీఆర్ఎస్ నాయకులు మోపడం భావ్యం కాదని కోఆప్షన్ సభ్యుడు రహీం, ఎంపీటీసీ సభ్యుడు దాసరి శ్రీనివాసులు అన్నారు. మన్ననూరులో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తగాదా జరుగడానికి గల కారణాలను తెలుసుకొని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, బీఆర్ఎస్ నాయకులు నిందలు మోపాలన్నారు.

డీసీసీ కార్యదర్శి సంబు వెంకటరమణ, కాంగ్రెస్ జిల్లా నాయకులు జూలూరి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు రహిమాన్, రమణగౌడ్, లోకనాథం, హన్మంత్ రెడ్డి, సంబు శోభ పాల్గొన్నారు.

పెద్దచెరువు కట్టపై ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

- ఇబ్బంది పడుతున్న రైతన్నలు



ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

తెలకపల్లి, మే 15 : మండల కేంద్రంలోని పెద్దచెరువు కట్టపై ఏపుగా పెరిగిన ముళ్ల పొదలతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ చెరువు కట్టపై నుంచి అవతలి వైపు ఉన్న పొలాలకు రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ముళ్ల పొదల వలన ఎద్దుల బండ్లుగాని, పశువులు గాని వచ్చిపోయే పరిస్థితి లేకుండా పోయింది. చెరువు కింద ఉన్న పొలాలు సాగు చేయకపోవడంతో చెరువు కట్ట గురించి ఎవరూ పట్టించుకునే పరిస్థితిలో లేరు. ఈ విషయంపై గతంలో రైతులు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నారు. అయినా ఫలితం శూన్యం. చెరువు కట్టపై ఉన్న ముళ్ల పొదలను తొలగిస్తే తమ పొలాలకు పోయే విధంగా దారి ఏర్పడుతుందని, చుట్టూ తిరిగి పోవాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ముళ్ల కంపలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

ఈ రోడ్డు మరమ్మతు జరిగేనా?



అసంపూర్తిగా రోడ్డు

కల్వకుర్తి, మే 15 : కల్వకుర్తి పట్టణంలోని ప్రధాన రహదారిని అసంపూర్తిగా వదిలేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారిందని పలువురు వాహన చోదకులు విమర్శిస్తున్నారు. కల్వకుర్తి పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తా నుంచి బస్టాండ్ వరకు వెళ్లే ప్రధాన రహదారిలో బస్సు డిపో ముందు కొంత రోడ్డు భాగాన్ని అసంపూర్తిగానే వదిలేశారు.

దానిపై మట్టి ఉండడం ఆ పక్కనే గుంత ఉండడంతో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఇదివరకు పలువురు రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొద్ది భాగంలో అసంపూర్తిగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని వాహన చోదకులు డిమాండ్ చేస్తున్నారు.

జాతీయ రహదారి భూసేకరణ, విస్తరణ పనులు

వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఉదయ్‌కుమార్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి పనులు, భూసేకరణ పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం నాగర్‌కర్నూల్ కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్ సంబంధిత శాఖలైన రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులతో భూసేకరణ పనులు, జాతీయ రహదారి పురోగతి పనులపై సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారికి సంబంధించి జిల్లాలోని కొల్లాపూర్ మండల పరిధిలోని వరిదేల గ్రామ పరిధిలో భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అందుకు సంబంధించిన భూయాజమానులు, రైతులకు కావాల్సిన నష్ట పరిహారాన్ని త్వరితగతిన చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. జిల్లాలో నేషనల్ హైవే అభివృద్ధి పనులు, నేషనల్ హైవే 167కే కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 79కిలో మీటర్ల వరకు కొనసాగుతున్న విస్తరణ పనుల్లో వేగం పెంచాలన్నారు. లాండ్ ఆక్విజేషన్ పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి కావాలని, అవార్డు పరిహారం చెల్లింపుల పురోగతిపై త్వరలో సమీక్షించనున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నుంచి కొల్లాపూర్ వరకు 79కిలో మీటర్ల పరిధిలో కొనసాగుతున్న విస్తీర్ణ పనుల్లో ఇప్పటి వరకు 33కిలో మీటర్ల రహదారి పనులు పూర్తైనట్లు జాతీయ రహదారి ఆర్‌అండ్‌బీ ఎస్ఈ కలెక్టర్‌కు వివరించారు. జాతీయ రహదారి ఆర్‌అండ్‌బీ ఎస్ఈ ధర్మారెడ్డి, కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజు, రెవెన్యూ ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయక బాధ్యతల నిర్వహణతోనే లోక్‌సభ ఎన్నికలు విజయవంతం

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా నిర్వహించడంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది తమవంతు బాధ్యతలను సమర్ధవంతంగా, స్ఫూర్తిదాయకంగా నిర్వహించడంతోనే విజయవంతంగా పూర్తి చేయగలిగామని కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలు విజయవంతంగా పూర్తి కావడంతో ఎన్నికల అధికారులు, సిబ్బంది బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగియడంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది సమష్టి కృషి వల్లనే జిల్లాలో ఎన్నికలు విజయవంతమయ్యాయని తెలిపారు. జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషమని ఆయన అన్నారు. ఎన్నికల సిబ్బందికి అన్ని వసతులు కల్పించడం, నాణ్యమైన భోజనాన్ని అందించడంలో అధికార యంత్రాంగం సఫలీకృతమైందన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములైన అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ ఈ సందర్భంగా ప్రశంసించారు. కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ విభాగాల ఎన్నికల నోడల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఓటమి భయంతోనే కాంగ్రెస్ దాడులు

- పోలీసులు ప్రభుత్వానికి కొమ్ము కాస్తున్నారు

- బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్



నాగర్‌కర్నూల్ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 15: ఓటమి భయంతోనే బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులకు పాల్పడుతోందని నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలను ఆర్.ఎస్.ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్‌పీ మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండలం చిన్నకార్పాముల గ్రామంలో మూడు రోజుల క్రితం బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ దాడులు చేశారని పేర్కొన్నారు. పోలీసులు దాడి చేసిన వారిని శిక్షించాల్సింది పోయి వారికే కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. దాడి సంఘటనపై మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డితో పాటు తానూ స్వయంగా వెళ్లి జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసినా ఇప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోకపోతే బాధితులతో కలిసి రాష్ట్ర కమిషన్, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన హెచ్చరించారు. జడ్పీటీసీ సభ్యుడు శ్రీశైలం, నాయకుడు మంగి విజయ్, కౌన్సిలర్ ఖాజాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం దాడులను ప్రోత్సహిస్తోంది

అచ్చంపేటటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం దాడులను ప్రోత్సహిస్తుందని మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. బుధవారం పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌తో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని 2వవార్డు సభ్యురాలు నిర్మల బాలరాజుపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి దాడులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని దాడి జరిగినా ఖండించకపోవడం ఏంటని ప్రశ్నించారు.

పోలీసులు ప్రజల పక్షాన నిలవాలని ప్రభుత్వానికి వత్తాసు పలికినట్లు వ్యవహరిస్తే ఊరుకునేది లేదన్నారు. భయభ్రాంతులకు గురిచేస్తే వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. దాడి జరిగిన సమయంలో పోలీసులు అక్కడే ఉన్న చూసీ చూడనట్లు వ్యవహరించడం పోలీసు వ్యవస్థకే అవమానమన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడంలో ఎమ్మెల్యే వైఖరి ఏంటో చెప్పాలన్నారు. మునిసిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్సులకు సన్మానం



కల్వకుర్తిలో నర్సులను సన్మానిస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ నాయకులు

కల్వకుర్తి, మే 15 : కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ నర్సుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని బుధవారం నర్సులను సన్మానించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం సమక్షంలో ఆసుపత్రిలోని నర్సులను శాలువాలతో సత్కరించారు. అనంతరం క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ వైద్య వృత్తిలో నర్సుల సేవలు ఎంతో పవిత్రమైనవని పేర్కొన్నారు. వారిని సన్మానించడం తాము అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ అధ్యక్షుడు రాజేందర్, ఉపాధ్యక్షుడు చిగుళ్లపల్లి శ్రీధర్, కృష్ణయ్య తదతరులు ఉన్నారు.



పెద్దకొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నర్సులను శాలువాతో సన్మానిస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

● పెద్దకొత్తపల్లి: మండల కేంద్రమైన పెద్దకొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న నర్సులను క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకుడు వాస రాఘవేందర్ నర్సులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర నాయకురాలు శోభ, జే.వైష్ణవి, ల్యాబ్ టెక్నీషియన్ లక్ష్మీనరసింహాగౌడ్, సీఎస్‌వో శ్రీనివాసులు, ఫార్మాసిస్టు సంపత్, ఏఎన్ ఎఱు భాగ్యమ్మ, వెంకటమ్మ, చెన్నమ్మ, మనెమ్మ, జ్యోతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఫిజిక్స్ అరుణ్ కవితకు ప్రోత్సాహక బహుమతి

కొల్లాపూర్, మే 15 : సాయుధ తెలంగాణ పోరాట యోధుడు కర్క ముత్తారెడ్డి స్మారకార్థం ఉమ్మడి రాష్ట్ర స్థాయిలో వసుంధర విజ్ఞాన వికాస మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన కవి తల పోటీల్లో జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత, ఫిజిక్స్ అరుణ్‌కుమార్ మత సామరస్యం, భారతీయ అనే అంశంపై రాసిన కవిత ప్రోత్సాహక బహుమతిని గెలిచిందని కన్వీనర్ సుమలత బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఫిజిక్స్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ కరోనా సమయంలో యావత్తు ప్రపంచం కుల, మత సరిహద్దులు దాటేసి మానవత్వంను ప్రదర్శించిం దన్నారు. మానవత్వమే మన దేశ సందేశంగా చరిత్ర చెబుతున్నదని, గౌతమ బుద్ధుడు, వివేకానందుడు, గాంధీజీ, అంబేడ్కర్, మదర్‌థెరిస్సా, అబ్దుల్ కలాం వంటి మహానుభావులు భవిష్యత్తు తరాలకు మానవత్వపు పరిమళాన్ని ప్రకాశించేలా చేశారని అన్నారు.

ఉపాధి పెండింగ్ బిల్లులు చెల్లించాలి

చారకొండ, మే 15: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో గ్రామాల్లో పనులు చేస్తున్న కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండపల్లి బాలస్వామి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలు నెలల తరబడి పనులు చేస్తున్నా కూలీలకు బిల్లులు సకాలంలో చెల్లించడం లేదని అన్నారు. పనులు చేస్తున్న ప్రదేశంలో కనీసం తాగునీరు, టెంట్లు తదితర సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. వెంకటయ్య, రాములు, అంజనేయులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ముంపు గ్రామస్థుల దీక్ష

రేవల్లి, మే 15 : మండలంలోని బండరావిపాకుల గ్రా మంలో ముంపు గ్రామస్థులు చేస్తున్న ధర్నా బుధవారం 90వ రోజుకు చేరుకుంది. దీక్షలో పాల్గొన్న ముంపు గ్రామానికి చెందిన సుకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్ని రోజులైనా పునరావాసం డబ్బులు, ఇళ్ల స్థలాలు వచ్చేవరకు ఎట్టి పరిస్థితుల్లోను దీక్షను ఆపమని అన్నారు. డబ్బులు అకౌంట్లో పడతాయని అధికారులు, ప్రజాప్రతినిధులు అంటున్నారు కానీ ఇప్పటివరకు ఎలాంటి సహాయం అందలేదని, కష్టాలను తీర్చేవరకు దీక్ష ఆపమని తెలిపారు.

ఘనంగా పాద పూజోత్సవం



తల్లిదండ్రులకు పాదపూజోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

తెలకపల్లి, మే 15 : మండల కేంద్రంలో ఉన్న సీఎల్ఆర్ కళాశాలలో శృతిలయ కల్చరల్ అకాడమీ, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పాదపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యోగా గురువు రమేష్‌గురూజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు సంస్కృతీ సాంప్రదాయాలతో పాటు అమ్మానాన్న అనే పిలుపు నేర్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కళాశాల కరస్పాండెంట్ రాజ మహేందర్‌రెడ్డి, నిర్వాహకులు సుఖజీవన్‌రెడ్డి తెలిపారు.

వడదెబ్బపై కళాజాతా ప్రదర్శన

వెల్దండ, మే 15 : మండల కేంద్రంలో కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో వడదెబ్బపై కళాజాతా ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు వడదెబ్బ, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తతపై ఆటపాటల ద్వారా ప్రజలకు వివరించి అవగాహన కలిగించారు. కళాకారాలు బాస్కర్, జల్లికృష్ణ, శివనాగులు, నరేందర్, శివ, సికిందర్, పార్వతమ్మ, ఆస్మా, రేణుక తదితరులు ఉన్నారు.

ఉత్తమ గ్రామ పంచాయతీల ఎంపికపై సమీక్ష



వ్యవసాయ శాఖకు సంబంధించిన సమాచారాన్ని వివరిస్తున్న వ్యవసాయ అధికారి కమల్‌కుమార్

తిమ్మాజిపేట, మే 15 : తిమ్మాజిపేట మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉత్తమ గ్రామ పంచాయతీల ఎంపిక ప్రక్రియపై పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పది శాఖలకు సంబంధించిన అధికారులు తమ నివేదికలను సాధించిన పురోగతిని సమాచారాన్ని వివరించారు. ఎంపీడీవో లక్ష్మీదేవి మాట్లాడుతూ అధికారులు వివరించిన అంశాలను తెలిసిన సమాచారాన్ని త్వరగా పంచాయతీ డెవలప్‌మెంట్ ఇండెక్స్ పోర్టల్‌లో పొందుపర్చాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. సేకరించిన పీడీఐ డాటా ద్వారా ఉత్తమ గ్రామపంచాయతీ ఎంపిక జరుగుతుందన్నారు. గ్రామాల్లో పోటీ పడుతూ పనులు చేయాలని ఉత్తమ ఫలితాలు పొందాలన్నారు. మండల వ్యవసాయ అధికారి కమల్‌కుమార్, ఎంపీవో బ్రహ్మచారి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీకి దరఖాస్తు చేసుకోవాలి

కల్వకుర్తి, మే 15 : కల్వకుర్తి పీఏసీఎస్ పరిధిలో పంట రుణాలు పొందిన రైతులు రుణమాఫీ కోసం దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, సీఈవో వెంకట్‌రెడ్డిలు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రుణాలు పొందిన రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్ ఫోన్‌నెంబరును జతపర్చి పీఏసీఎస్ కార్యాలయంలో అందజేయాలని చైర్మన్ జనార్దన్‌రెడ్డి, సీఈవో వెంకట్‌రెడ్డిలు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

తిమ్మాజిపేట, మే 15: తిమ్మాజిపేట మండల పరిధిలోని మారేపల్లి గ్రామానికి చెందిన రాజీగాని అశోక్ కుమారుడు గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. గ్రామస్థుల ద్వారా విషయం తెలుసుకున్న నేరేళ్లపల్లి మనోహర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లుగా తాను కులమతాలకు, రాజకీయ పార్టీలకతీతంగా నిరుపేద కుటుంబంలో ఎవరు చనిపోయినా ఆ కుటుంబానికి చేయూతనందిస్తూ ఇదే తరహాలో సామాజిక సేవలు చేస్తూ ముందుకు సాగడమే తన లక్ష్యమన్నారు.

'హామీలను అమలు చేయాలి'

కోడేరు, మే 15 : కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.నరసింహ అన్నారు. బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీ 2లక్షల రుణమాఫీతో పాటు రైతుబంధును కౌలుదారులకు కూడా ఇవ్వాలన్నారు. వృద్ధులకు ఒంటరి మహిళలకు, దివ్యాంగులకు తదితరులకు ప్రకటించిన పింఛన్ ఇవ్వాలన్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయాన్ని బ్యాంకుల నుంచి ఇప్పించాలన్నారు. కోడేరు గ్రామ కార్యదర్శి పి.రవి, నాయకులు నరసింహ, లక్ష్మయ్య, రాములు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

'ప్రజలు కాంగ్రెస్ పక్షాన ఉన్నారు..'

ఊర్కొండ, మే 15: ప్రజలు కాంగ్రెస్ పక్షాన ఉన్నారని మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో మండల ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆదరించారని అన్నారు. ఆరు గ్యారెంటీలను ప్రజలకు చేరువ చేస్తామని, ప్రభుత్వ పథకాలను ప్రతీ ఒక్కరికి అందేవిధంగా చూస్తామని పేర్కొన్నారు. గ్రామ అధ్యక్షుడు ఆరీఫ్, నాయకులు మనోహర్ రెడ్డి, జగదీష్, ఆదినారాయణ, బాస్కర్, గణేష్, దయాకర్, రమేష్, రాజా శ్రీశైలం తదితరులు ఉన్నారు.

'రాష్ట్రంలో మెజార్టీ సీట్లు కాంగ్రెస్‌కే'

వంగూరు, మే 15: తెలంగాణలోని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ మెజార్టీ స్థానాలు గెలుస్తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఐదు గ్యారెంటీల అమలును గుర్తించిన ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కే ఓటు వేశారని, దీంతో రాష్ట్రంలో 14 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని, దేశంలో కూడా ఇండియా కూటమిదే విజయమని ధీమా వ్యక్తం చేశారు.

దోస్త్ సహాయక కేంద్రం ఏర్పాటు

వనపర్తి రూరల్, మే 15 : ఇంటర్మీడియట్, తత్సమాన పరీక్షలు పాసైన విద్యార్థినీ, విద్యార్థులందరూ డిగ్రీలో ప్రవేశాల కోసం దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ ప్రారంభమయ్యాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, వనపర్తి జిల్లా దోస్త్ అడ్మిషన్ల కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలోని విద్యార్థులందరు ఈ సహాయక కేంద్రం వసతిని వినియోగించుకోవాలని, ఎలాంటి సాంకేతిక సమస్యలు గాని, ఇతరత్రా సమస్యలు గాని తలెత్తినట్లయితే 9100660940, 9491167549, 9490000670 లలో సంప్రదించాలని పేర్కొన్నారు. మొదటి విడత వెబ్ ఆప్షన్లు ఈనెల 20 నుంచి ప్రారంభమవుతాయని, మొదటి విడత సీట్ల కేటాయింపు వివిధ కళాశాలలకు జూన్ ఆరో తేదీన ఉంటుందని, రెండవ విడత జూన్ ఆరు నుంచి, మూడవ విడత జూన్ 19 నుంచి ఉంటాయని, జులై ఎనిమిదో తేదీ నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభమవుతాయని వివరించారు. విద్యార్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.